

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి
తొమ్మిది నెలల బకాయిలు చెల్లించాలి
డీఐఈవో ఆఫీస్ వద్ద గెస్ట్ లెక్చరర్ల ఆందోళన
9
సాంకేతికతతో మరింత అభివృద్ధి
రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

యూకే పార్లమెంట్ సందర్శన

లండన్ పర్యటనలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్



పార్లమెంట్ ఆవరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ గుత్తా, అధికారులు

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బార్బడోస్‌లో జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్(సీపీఏ) కాన్ఫరెన్స్ అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డిల బృందం లండన్‌లోని ప్యాలెస్ ఆఫ్ వెస్ట్ మినిస్టర్‌లో ఉన్న గ్రేట్ బ్రిటన్ హౌజ్ ఆఫ్ పార్లమెంట్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు హౌజ్ ఆఫ్ లార్డ్స్, హౌజ్ ఆఫ్ కామన్స్‌ను పరిశీలించారు. బ్రిటన్ పార్లమెంట్ వ్యవస్థ, సభ్యుల విధానాలు, చట్ట నిర్మాణ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, సెక్రటరీ డాక్టర్ నర్సింహాచార్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో బ్రిటన్ పాలన, ప్రజాస్వామ్య వ్యవస్థపై అధ్యయనం చేసి, తెలంగాణ శాసన వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా ఆచరణాత్మక ఆలోచనలను అవలంబించనున్నట్లు సమాచారం.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ధాన్యం సేకరణకు పక్కాగా ఏర్పాట్లు

జిల్లాలో 129 కొనుగోలు కేంద్రాలు ● కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో 1.52 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందన్నారు. కాగా, సుమారు 3.84 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని అంచనా వేశామని వివరించారు. కాగా, జిల్లాలో మొత్తం 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రవాణా, నిల్వ, చెల్లింపుల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లో ట్యాబ్ ఎంట్రీ పూర్తవుతుందని, 48 గంటల్లోగా బిల్లులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు చేపట్టామని వివరించారు. మొక్కజొన్న సేకరణకూ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తేమ కొలిచే పరికరాలు, తాగునీరు తదితర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల సౌకర్యార్థం జిల్లా స్థాయిలో టోల్‌ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి, డీఆర్డీవో శ్రీనివాస్, డీఎస్‌వో సుదర్శన్, సివిల్ సప్లైస్ డీఎం మోహన్ కృష్ణ, వ్యవసాయ అధికారి రాజారత్నం, డీసీవో నాగార్జున, లీగల్ మెట్రాలజీ అధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ మను చౌదరి తెలిపారు. బుధవారం సచివాలయం నుంచి మంత్రులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లు గురించి వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. అలాగే ధాన్యం రవాణా చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం సుగుణాబాయి, అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు ఏటా రెండు డ్రెస్ కోడ్ చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో, మునిసిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేయనున్నారు. కాగా, తొలి విడతలో ఒక్కో సభ్యురాలికి ఒక చీర మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 18,933 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 1,93,065 మంది సభ్యులు ఉన్నారు. కాగా, జిల్లాకు ఇప్పటివరకు కేవలం 94,864 చీరలు మాత్రమే వచ్చాయి.



డ్వాక్రా మహిళలకు

తీపికబురు

త్వరలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

సమభావన సంఘాల సభ్యులకు డ్రెస్ కోడ్

ఇందిరాగాంధీ జయంతి రోజున పంపిణీకి సన్నాహాలు

తొలి విడతలో ఒక సభ్యురాలికి ఒక చీర చొప్పున అందజేత

ఇప్పటివరకు జిల్లాకు సగం చీరల చేరిక

జిల్లాలోని సంఘాలు, సభ్యుల వివరాలు	
మండలాలు	20
మున్సిపాలిటీలు	04
సంఘాలు	18,933
సభ్యులు	1,93,065
వచ్చిన చీరలు	94,864
రావాల్సినవి	98,201

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలుత బతుకమ్మ, దసరా పండుగ సమయంలో మహిళా స్వయం సభ్యులకు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే సభ్యులకు సరిపడా చీరలు ఉత్పత్తి కాకపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ చీరలను నవంబరు మొదటి వారం వరకు జిల్లాలకు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబరు 19న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభ్యులందరూ సంఘం సమావేశాలకు, కార్యక్రమాలకు ఆ చీరలు కట్టుకుని డ్రెస్ కోడ్‌తో హాజరు కావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. మహిళా శక్తి పేరుతో పంపిణీ చేయనున్న ఈ చీరలన్నీ బ్లూ కలర్‌లో ఉండగా, యువతులకు, మధ్య వయస్సు మహిళలకు వేర్వేరు చీరలు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. యువతులకు 6.5 మీటర్లు, మహిళలకు 9 మీటర్ల చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిసింది. వికారాబాద్ జిల్లాలో 18,933 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వాటిలో 1,93,065 మంది మహిళలు సభ్యులు ఉన్నారు. వారికి తొలి

మిగతా 10వ పేజీలో...



మిగతా వారికి ఈ‘సారీ’ నిరాశే

బతుకమ్మ చీరల కోసం ఎదురు చూస్తున్న మహిళలకు ఈసారి కూడా నిరాశే ఎదురైంది. గతేడాది కూడా ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయలేదు. గత ప్రభుత్వం ఏటా బతుకమ్మ పండగకు తెల్లరేషన్ కార్డులో నమోదైన 18 ఏళ్లకు పైబడిన యువతులు, మహిళలందరికీ చీరలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాదైనా మహిళలందరికీ బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుందని ఆశించిన వారికి ఈసారీ కూడా నిరాశే మిగిలింది.

ఆర్డీవోకు పదోన్నతి

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా వాసుచంద్ర



వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్ ఆర్డీవో ఎం.వాసుచంద్రకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ ఆర్డీవోగా 16 నెలల కిందట బాధ్యతలు స్వీకరించిన ఆయన అనతికాలంలోనే చురుకైన అధికారిగా పేరుతెచ్చుకున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఇక్కడే స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు.



నేడు శామీర్‌పేటకు మంత్రి పొంగులేటి

ప్రారంభించనున్న నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



శామీర్‌పేట, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలో నేడు (గురువారం)రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు దర్గా సమీపంలో నూతన శామీర్‌పేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. కాగా, ఈ నూతన కార్యాలయాన్ని కీసర డివిజన్ ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయాన్ని స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు గురువారం నూతన భవనంలోనికి తరలించనున్నారు.

వరికి తెగుళ్ల బెడద



ఎదులాబాద్‌లో తెగులు సోకి పూర్తిగా ఎండిపోయిన వరిపైరు

కోత దశలో ఎండుతున్న పంట

ఎండాకుతెగులు, దోమపోటు, కంకినల్లితో ఉక్కిరిబిక్కిరి

మందులు చల్లినా ప్రయోజనం శూన్యం

ఆందోళనలో అన్నదాతలు

ఏడు ఎకరాలు ఎండింది



ఏడెకరాల్లో వరిపంటను సాగు చేశాను. మొదట్లో పైరు బాగానే పెరిగింది. కానీ కోత దశలో బాక్టీరియా ఎండాకు తెగులు సోకింది. దీంతో పంట మొత్తం పూర్తిగా ఎండిపోయింది. ఇప్పుడు మందులు చల్లినా ప్రయోజనం ఉండదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.

-జెనిగే లింగం, కౌలు రైతు, ఎదులాబాద్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పనిచేసినా పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్లు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. వరిసాగు మొదట్లో బాగానే ఉన్నా కోతదశలో తెగుళ్లు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎండాకు తెగులు, దోమపోటు, కంకినల్లి వంటి తెగుళ్లు సోకి వరిపంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో కనీసం పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం, పదిహేను రోజుల్లో కోతలు చేపట్టే దశలో మందులు చల్లినా ఎలాంటి ఫలితం ఉండదని వ్యవసాయ అధికారులు సూచిస్తుండటంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

తాలుగా మారిన గింజలు

ఘట్‌కేసర్ మండల పరిధిలో సుమారు 3,100 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా ఎదులాబాద్‌లోనే అత్యాధికంగా 1,500 ఎకరాల్లో సాగుచేపట్టారు. ఈ వానాకాలం సీజన్‌లో రైతులు సన్న రకాలైన

మిగతా 10వ పేజీలో...

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా!



రాజశేఖర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం సూచన మేరకు బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించినట్లు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఆంధ్రజ్యోతితో తెలిపారు. ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం నిర్ణయాన్ని శిరసావహిస్తానని తెలిపారు. అయితే తన రాజీనామాకు రెండు రోజులు గడువు అడిగినట్లు వివరించారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. తనకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ ఇటీవల ఎందుకు దూరం పెరిగిందో తెలియదన్నారు.

కేరళలో గురుకుల విద్యార్థిని ఎంఎస్ పూర్తి



తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్ (ఎంవీఎఫ్) విద్యార్థిని అరుణ.. కేరళలోని త్రిస్సూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంఎస్ పూర్తి చేసుకుంది. దీంతో, వైద్య విద్య పూర్తి చేసిన మొదటి గురుకుల విద్యార్థిగా రికార్డులకెక్కింది. పదో తరగతి వరకు తాండూరు గురుకులలో చదువుకున్న అరుణ స్కూల్ టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. హైదరాబాద్‌లో శ్రీచైతన్యలో ఉచితంగా సీటు పొంది, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించింది. తర్వాత మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పీజీ పట్టా అందుకున్న అరుణను పలువురు అభినందించారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి



ఎదులాబాద్‌లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్

ఘట్‌కేసర్ రూరల్/దోమ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాడిరైతులు తప్పని సరిగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మేడ్చల్ జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ శంకర్ సూచించారు. అలాగే పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించి పాల దిగుబడిని పెంచుకోవాలని కోరారు. ఎదులాబాద్ పశుఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఏడీ శ్రీనాథ్, మండల పశువైద్యాధికారి పద్మిని, జిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు మేకల కుమార్, కందుల కుమార్, వీఎల్‌వో నరేందర్‌గౌడ్, జేవీవోలు భూషన్ కులకర్ణి, శంకర్‌రెడ్డి, సిబ్బంది గణేశ్, శ్రీకాంత్, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.



శివారెడ్డిపల్లిలో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ సదానందం

దోమ మండలం శివారెడ్డిపల్లిలో ..

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి సదానందం సూచించారు. బుధవారం దోమ మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎన , పరిగి నియోజకవర్గ ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, దోమ మండల పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆనంద్, చందన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శాంతకుమార్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, అనంతరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

‘కాగ్నా’లో ఇసుక రీచ్‌ల పరిశీలన

తాండూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చిట్టిఘనాపూర్, చంద్రవంచ గ్రామ శివారుల్లోని కాగ్నా నదిలో ఇసుక రీచ్‌లను జిల్లా అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆధ్వర్యంలో కాగ్నా నది సమీపంలో ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఇసుక ఏ మేరకు ఉంది? తరలించడానికి అనువుగా ఉందా? అనే అంశాలపై తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్‌లతో చర్చించారు. వారివెంట ఆర్‌డబ్ల్యూఎస్‌ఈఈ రవికుమార్, మైన్స్ ఆర్ఐ నిర్మల కార్యదర్శి విరప్ప, ఇరిగేషన్ ఏఈ సాయిబన్న, తదితరులు ఉన్నారు.



ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న డీపీవో జయసుధ

డీసీసీ అధ్యక్ష పదవికి రఘువీరారెడ్డి దరఖాస్తు



ధారూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):అంతారం గ్రామానికి చెందిన పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి బుధవారం వికారాబాద్ డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన వికారాబాద్‌లో ఏఐసీసీ పరిశీలకుడు సూరత్‌సింగ్ ఠాకూర్‌కు దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని దరఖాస్తు చేసినట్లు చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేశానని, మరోసారి అవకాశమిస్తే జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు.

పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి..



వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డీసీసీ అధ్యక్ష పదవికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. వికారాబాద్ ఎన్నెపల్లిలోని ఛాయా బాంక్వెట్ హాల్‌లో ఏఐసీసీ అబ్జర్వర్ సూరజ్‌సింగ్ ఠాకూర్‌కు దరఖాస్తు ఇచ్చారు. కార్యక్రమంలో అబ్జర్వర్లు బెల్లయ్యనాయక్, వేణుగౌడ్ పాల్గొన్నారు. వికారాబాద్, ధారూరు మండలాల నాయకులు తమ అభిప్రాయాలు తెలిపారు.

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మేకగూడలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటుకు కృషిచేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామ మండలం మేకగూడ-జేపీదర్గా రోడ్డు వరకు హెచ్ఎండీఏ నిధులు రూ.70లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి నాయకులతో కలసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. చంద్రాయన్‌గూడలో 15లక్షలతో నిర్మిస్తున్న మహిళా భవనం, రంగాపూర్‌లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, గోవర్ధన్‌గౌడ్, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, పాండురంగారెడ్డి, విగ్నేశ్వర్‌రెడ్డి, బండారి రాజు, రాజునాయక్, గబ్రు చౌహాన్, రవీందర్‌గౌ డ్, జ్ఞానేశ్వర్, సత్తయ్య, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, శేఖర్, శ్రీశైలం, శివ, రామస్వామి, రాజేందర్, శేఖర్‌గౌడ్, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రికి వినతిప్రతం ఇస్తున్న అంజయ్య, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కోట్‌పల్లి యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకోండి

● మంత్రి తుమ్మలను కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మార్కెట్ కమిటీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పనుల విషయంలో బుధవారం వ్యవసాయ, మార్కెటింగ్‌ల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంజయ్యతో కలిసి విన్నవించారు. మార్కెట్ కమిటీలను అభివృద్ధి చేసి రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని వారు వినతి పత్రంలో కోరారు. దీంతో స్పందించిన మంత్రి.. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

18న బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి



బంద్‌ను విజయవంతం చేయాలని నినదిస్తున్న బీసీ సంఘాల నాయకులు

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీన తలపెట్టిన బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లైబ్రేరియన్స్ ఛైర్మన్ జి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం క్లబ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీసీ సంఘాల నాయకుల సమావేశంలో మాట్లాడారు. బీసీ హక్కుల కోసం చేపట్టిన ఈ బంద్‌లో అన్ని కుల సంఘాలు పాల్గొని బంద్‌ను దిగ్విజయం చేయాలని కోరారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరియాదవ్ మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులు బంద్ విజయానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, శేఖర్, అంజయ్య, శంకర్, శివరాజు, రాజశేఖర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, రాములుగౌడ్, మారుతి, కోడి లక్ష్మణ్, ఎల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి



ఈదులపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నందిగామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ సౌజన్య అన్నారు. గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పలువురు రైతులకు కేఎస్ఎం-1638 రకానికి చెందిన చిరుసంచుల విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇప్పటికే వేసిప ఈ రకానికి చెందిన పంటలను నందిగామ మండలంలోని ఈదులపల్లి, వీర్లపల్లి, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో సౌజన్య, మండల వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. పైరు పెరుగుదల, పంట రక్షణతో పాటు రైతుల అనుభవాలను అడిగి తెలుసుకొని వారికి తగిన సాంకేతిక సూచనలిచ్చారు. కార్యక్రమంలో అధికారులు రామశివరాం, శిరీష, రవీందర్, రవి పాల్గొన్నారు.

టీడీపీలో పనిచేసేవారికే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

● పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపునిచ్చి, అలాంటి వారికి పదవులు కల్పిస్తామని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. శ్రీశైలం బోర్డు సభ్యుడిగా ఎంపికైన సిల్వేరు కాశీనాథ్ బుధవారం షాద్‌నగర్ వచ్చి, వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పద్మశాలి భవనాన్ని సందర్శించిన కాశీనాథ్‌ను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన నర్సింహులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తెలంగాణ టీడీపీ నాయకులకు సైతం ఆంధ్రప్రదేశ్ ఆలయాల్లో పదవులిస్తున్నారని గుర్తుచేశారు. పనిచేసే వారికి పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటికే నన్నూరు నర్సిరెడ్డిని టీటీడీ బోర్డు మెంబరుగా, సిల్వేరు కాశీనాథ్‌ను శ్రీశైలం ఆయన బోర్డు సభ్యుడుగా, శ్రీపతి సతీష్‌ను కాణిపాకం ఆలయ సభ్యుడిగా నియమించారని గుర్తుచేశారు. ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆలయాల్లో పరిశుభ్రతను, పవిత్రతను కాపాడుతూ, భక్తులకు సౌకర్యాలను పెంచడానికి కృషిచేయాలని కోరారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని కాశీనాథ్ అన్నారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు కోట దాస కృష్ణయ్య, వగ్గు కిశోర్, చిన్న బాల్‌రాజ్, బాస రజేందర్, పాలాది శివ, దాస రమేష్, రాములు, వర్కాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బలపడుతున్న బీసీల ఐక్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

షాద్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీల ఐక్యత రోజురోజుకూ బలపడుతూ స్ఫూర్తిమంతంగా నిలుస్తోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మూడేళ్ల తర్వాత రాష్ట్రంలో బీసీలు అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తూ.. షాద్‌నగర్ బైపాస్ రోడ్డు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే కాలంలో బీసీల చైతన్యమే రాజ్యాధికారాన్ని నిర్ణయిస్తుందని తెలిపారు. జెండాలు మోయడమే కాదు.. ఎజెండాలు కూడా మాకు తెలుసన్నారు. భవిష్యత్తులో బీసీలే రాజ్యమేలుతారన్నారు. తమ పార్టీ బడుగు బలహీనవర్గాల పక్షాన నిలుస్తుందన్నారు. బీసీ మహాసభ నాయకులు శ్రీధర్‌వర్మ, గిరి, నర్సింహులు, ప్రదీప్, యాదయ్య, వేణుగోపాల్, పాల్గొన్నారు.

హోంగార్డుకు ఉత్కృష్ట సేవా పతకం



డీజీపీ నుంచి పతకాన్ని అందుకుంటున్న హోంగార్డ్ కృష్ణ

యాచారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించే ఉత్కృష్ట సేవాపతకాన్ని కుర్మిద్దకు చెందిన మూలి కృష్ణ మంగళవారం డీజీపీ శివధర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అతడు 2008లో హోంగార్డుగా ఎంపికయ్యారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ విభాగంలో, 2010లో ఫలక్‌నుమాలో విధులు నిర్వహించారు. అనంతరం బదిలీ అయి 2010 నుంచి డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

75 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కులకచర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాంరెడ్డిపల్లిలో సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి 75క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అధికారులు గ్రామంలో ఓ ఇంట్లో దాడులు చేయగా 75క్వింటాళ్ల రేషన్ సన్న బియ్యం పట్టుబడ్డాయి. పట్టుబడిన బియ్యాన్ని సీజ్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండలంలో మొదటిసారి పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యు) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కొడంగల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 765,75 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు.

దుద్యాల్‌లో లఘు చిత్రం షూటింగ్

దుద్యాల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దుద్యాల్‌లో బుధవారం లఘు చిత్రం షూటింగ్ నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసేందుకు లగచర్ల గ్రామానికి చెందిన ఈర్లపల్లి రమేశ్ లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మత్తు పదార్థాలను తీసుకునే యువకులకు పోలీసులు ఇచ్చే కౌన్సిలింగ్‌కు సంబంధించిన దృశ్యాలను స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో చిత్రీకరించారు. ఎస్సై యాదగిరి, పోలీసు సిబ్బంది సన్నివేశంలో నటించారు. ఈ సందర్భంగా చిత్రాన్ని నిర్మిస్తున్న రమేశ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది యువకులు మత్తుకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారనే విషయాన్ని లఘు చిత్రంలో పాట రూపంలో ప్రజల ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.



లఘు చిత్రం షూటింగ్‌లో ఎస్సై, పోలీసులు

త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):తాండూరు-హైదరాబాద్ రోడ్డులో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు త్వరలో పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఓ ఫంక్షన్ హాలులో పట్టణ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయల కోసం కలెక్టర్‌తో చర్చించామని, పనులు చేపడుతామని చెప్పారు. స్థలాలున్న అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామన్నారు. అనంతరం ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సిములు, ప్రభాకర్ గౌడ్, రజాక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్ లాల, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి


ఏవో రాజశేఖర్‌కు వినతి ప్రతం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ సభ్యుడు మాల చందు డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలల విద్యార్థులతో కలిసి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయ ఏవో రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ..రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు పై చదువులకు వెళ్లలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి చరణ్‌గౌడ్, వేణు, శ్రీశైలం, మీన, రుషిగౌడ్, శివ, ఇర్ఫాన్, విద్యార్థులు ఉన్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను నిలిపివేయాలి


అంతారంలో ఎర్రమట్టి తవ్వకాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

తాండూరు రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):అంతారం శివారులో ఆసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలను చేపడుతున్నారని రైతులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఎర్రమట్టి తవ్వకాలు జరిపే భూమిలో పురుగు మందు డబ్బాలతో ఆవేదన వ్యక్తం చేశారు. తవ్వకాలు నిలిపకుంటే ఆత్మహత్య చేసుకుంటామన్నారు. అక్రమంగా మట్టి తవ్వుతున్నా మైన్స్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్


గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమై ప్రజావిశ్వాసం కోల్పోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గ్యారంటీలు, 420హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తకుంట తండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ల సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. అన్ని వర్గాలను మోసగించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దోనాదుల కుమార్, మాజీ సర్పంచ్ శోభచందునాయక్, సుక్యమ్మలాలయ్య, ప్యాక్స్ వైస్‌ఛైర్మన్ సత్యం, జాన్యనాయక్, జైపాల్‌నాయక్, లాల్యానాయక్, బాలు, సైదులు, వెంకటయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో సత్యం, శివ, మహేందర్, రాంజా, భీమ్లా, గన్య, కాల్య ఉన్నారు.

ప్రతి వ్యక్తిలో స్వదేశీ భావన ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న సతీష్‌కుమార్ జీ తదితరులు

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్వదేశీ భావన ప్రతీ వ్యక్తిలో నిర్మాణం కావాలని, దేశ అభివృద్ధికి స్వదేశీ ఉద్యమం బాట చూపుతుందని స్వదేశీ జాగరణ మంచ్ అఖిల భారతీయ సహ సంఘటన మంత్రి సతీష్‌కుమార్ జీ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా మంచ్ ఆధ్వర్యంలో బసంత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాగరణ మంచ్ మహోత్సవాన్ని నిర్వహించారు. సతీష్‌కుమార్‌జీ, డాక్టర్ సత్తు లింగమూర్తి మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థను బలోపేతానికి స్వదేశీ వస్తువుల వినియోగం పెంచాలని తెలిపారు. టెక్నాలజీ ఆధారంగా యువత ఇతరులకు ఉద్యోగాలను కల్పించేలా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జనాభాయ్, డాక్టర్ నరేందర్‌రెడ్డి, రావులపల్లి శేఖర్‌రెడ్డి, జి.మహేశ్వర్, డి.సుధాకర్‌రెడ్డి, ప్రాంత కన్వీనర్ ఈశ్వర్, వీభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మహేందర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ సుజాత, కో-కన్వీనర్ శివశంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పట్టణంలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి జై

తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం తాండూరులో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీజేఎస్, సీపీఐ, సీపీఎం నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యాచరణపై బీసీ, జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 18న జరిగే బంద్‌ను విజయవంతానికి నిర్ణయించారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

ఆదిభట్ల/యాచారం. అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా, ప్రైవేటు ఏజెన్సీలు కార్మికుల పొట్ట కొడుతున్నాయని, ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. బుధవారం యాచారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కార్మికులతో సమావేశం అయ్యారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు అమలు చేయకుండా ఏజెన్సీలు భారీగా కోతలు విధించి వేతనాలిస్తున్నారని తెలిపారు.

సాంకేతికతతో మరింత అభివృద్ధి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మేడ్చల్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడంతో డిజిటలైజేషన్ వ్యవస్థను మరింత అభివృద్ధి పర్చొచ్చని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ గూగుల్ సంస్థతో డిజిటల్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై మాట్లాడారు. మల్లారెడ్డి విద్యాసంస్థల యాజమాన్యం ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు సాంకేతిక రంగంలో మంచి విద్యాబుద్ధులు నేర్పడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవటంతో పాటు ఏఐ ఆధారిత విద్యను అభ్యసించే వీలుంటుందన్నారు. సాంకేతిక రంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నందున విద్యార్థులకు ఈ రంగం పట్ల పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యా సంస్థలపై ఉందన్నారు. విద్యార్థులకు డాక్టర్ అబ్దుల్ కలాం ఆదర్శమన్నారు. విద్యార్థులను దేశానికి సేవలందించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో గూగుల్ సంస్థ ఇండియా హెడ్ ఎడ్యుకేషన్ అండ్ హెడ్ టెక్స్ వైభవ్‌కుమార్, దక్షిణ బారత హెడ్ సిద్ధార్థ్ దల్వాడి, మల్లారెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ మల్లారెడ్డి, వైస్‌ఛైర్మన్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉర్రూతలూగించిన మల్లారెడ్డి

కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి తన డ్యాన్స్‌తో ఉర్రూతలూగించారు. స్టేజిపై డ్యాన్స్ చేసి విద్యార్థుల్లో జోష్ నింపడంతో కేకలతో దద్దరిల్లింది. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- 9 నెలల బకాయిలు చెల్లించే వరకు విధులకు హాజరు కాము
- నోడల్ అధికారి కార్యాలయం వద్ద అధ్యాపకుల నిరసన


ఇంటర్ విద్య నోడల్ అధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అతిథి అధ్యాపకులు

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తమకు గత తొమ్మిది నెలలుగా రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అతిథి అధ్యాపకులు బుధవారం జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి (డీఐఈవో) కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 47మంది అతిథి అధ్యాపకులు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ.. తొమ్మిది నెలలుగా తాము వేతనాలకు నోచుకోక కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగు నెలల వేతనం రాలేదని, ఈ విద్యా సంవత్సరంలో ఐదు నెలలు అవుతున్నా ఇంకా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వేతనం వస్తుందనే భరోసాతో కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం దొరికిన చోటల్లా అప్పులు చేశామని, నెలలు గడుస్తున్నా చేసిన అప్పులు తీర్చేమార్గం లేక సమాజంలో అవమానాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే అధ్యాపకుల జీవితాల్లోనే వెలుగు లేకుండా పోయిందన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని వారు చెప్పారు. నెలనెలా వేతనాలు రాక, కొందరు తమ సేవలు రెన్యూవల్ కాక అతిథి అధ్యాపకుల జీవితాలు అగమ్య గోచరంగా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఆవేదన అర్థం చేసుకుని వెంటనే తమ వేతన బకాయిలన్నీ విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తమకు రావాల్సిన మొత్తం వేతనాలు చెల్లించే వరకు తాము తమ విధులకు హాజరయ్యేది లేదని వారు స్పష్టం చేశారు.

ఓటు చోరీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

- డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి


సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చల్లా నర్సింహారెడ్డి, పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ఓటు చోరీకి అడ్డుకట్ట వేయకుంటే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని డీసీసీ అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సాగిస్తున్న పోరాటంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా మాజీ మంత్రి రవీంద్రనాయక్‌తో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఓటు చోరీ ద్వారానే బీజేపీ అధికారాన్ని సాగిస్తోందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఐదు కోట్ల మందితో సంతకాల సేకరణ చేపట్టిందని నర్సింహారెడ్డి తెలిపారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా చేపడుతున్న సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అనుకూల, బీజేపీ వ్యతిరేక ఓట్లను గుర్తించి పథకం ప్రకారం ఓటర్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వాటికి బాధ్యులను వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఓటు చోరీకి వ్యతిరేకంగా చేపడుతున్న సంతకాల సేకరణకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని చెప్పారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల అభివృద్ధిపై కేంద్రం వివక్ష చూపుతోందని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ బిల్లును ఆమోదించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో హన్మనాయక్, జగన్ ఉన్నారు.

ఉత్తర్వులను ధిక్కరించి మరో భవనంలోకి ..

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును తరలించొద్దు

- కార్యాలయాన్నిప్రారంభిస్తే తీవ్ర పరిమాణాలు ..
- మేడ్చల్ ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి


శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి మరో భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తే సంబంధిత అధికారులు గానీ, నాయకులు గానీ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఎ-బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. శామీర్‌పేటలో ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకు స్థలంలో పార్కింగ్ లేకుండా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న శామీర్‌పేట మండల పరిషత్‌లోకి తరలించేందుకు గత నెల 15న ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, 23న మేడ్చల్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే కొందరు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులు, కొందరు నాయకులు శామీర్‌పేట దర్గా సమీపంలో నూతన భవనంలోకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అనువుగాని చోట్ల ఆఫీసు ఏర్పాటు ఎంత వరకు సమంజసమని ఆయన ధ్వజమెత్తారు. ఇలా చేస్తే కాంగ్రెస్ నాయకులను గానీ, ఇతర పార్టీల నాయకులను గానీ సహించేది లేదన్నారు. వారిపై లోకాయుక్తలో కేసులు పెడతానని హెచ్చరించారు. రెవెన్యూ మంత్రికి సైతం ఈ విషయమై వివరించానని తెలిపారు. అధికారులు పునరాలోచించాలని, అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను ఈ విషయమై కలిశానని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు కాదని మరో భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు ఉత్తర్వులు రాలేదని తెలిపారు. దర్గా వద్ద దాతల సహాయంతో నిర్మించిన భవనానికి ప్రభుత్వ అనుమతులు లేవని, అక్రమంగా కట్టిన భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎలా తరలిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో, అన్ని సౌకర్యాలు ఉండే పాత మండల పరిషత్‌లోనే కార్యాలయంలోనే రిజిస్ట్రార్ ఆఫీసును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, నాయకులు తుంకి బిక్షపతి, కమటం కృష్ణారెడ్డి, ఎల్ల మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, శంషాబాద్ మాజీ జడ్పీటీసీ బుర్కుంట సతీశ్, మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు అన్నారు. బుధవారం చౌదరిగూడ, సుల్తాన్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపునకు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్,గౌస్ పాషా, రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన కటికెల చింటు, కొమ్ము కిరణ్‌లు బీఆర్ఎస్‌లో చేరారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్యార పాండు, కార్మికులు

ఆమనగల్లు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు అన్నారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మండల పరిషత్ ఆవరణలో బుధవారం పంచాయతీ ఉద్యోగు, కార్మికుల సమావేశం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య అధ్యక్షతన నిర్వహించారు. పాండు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత హాజరయ్యారు. ఈ నెల 24, 25 తేదీల్లో మహబుబాబాద్ జిల్లా గార్లలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల రాష్ట్ర మహాసభల విజయవంతంపై చర్చించారు. మహాసభల కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏళ్లుగా సేవలందిస్తున్న పంచాయతీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. మహాసభలకు కార్మికులు తరలి రావాలని పాండు పిలుపునిచ్చారు. సంఘటితం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, పాండు, పర్వతాలు, ఆశీర్వాదం, కుమార్, దేలి, జంగయ్య పాల్గొన్నారు.

కరీంపూర్ వాసులకు వరాల జల్లు

- ప్రకటించిన కరీంపూర్ మాజీ సర్పంచ్ సుందరి అనిల్



కోట్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):కోట్‌పల్లి మండలం కరీంపూర్ గ్రామ ప్రజలకు ఆ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ వరాలు ప్రకటించారు.గ్రామ ప్రజల కోసం స్వచ్ఛందంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తానని తెలిపారు. తాను అమలు చేయనున్న సంక్షేమ కార్యక్రమాల గురించి బుధవారం వివరించారు. గ్రామంలోని ప్రతి ఆడపిల్ల వివాహానికి తాను రూ.1,05,116 సాయం చేస్తానని చెప్పారు. యువకుడి పెళ్లికి రూ.55,116 ఇస్తానన్నారు. కరీంపూర్ వాసుల వివాహం, నిశ్చితార్థం, పుట్టిన రోజు వేడుకల వంటి శుభ కార్యక్రమాలకు తన ఫంక్షన్‌హాల్‌ను ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. గ్రామంలో ఎవరు మరణించినా దహన సంస్కారాలకు రూ.11వేలు అందజేస్తానన్నారు. ప్రజల్లో ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఆపరేషన్ చేసుకుంటే తనవంతు సాయంగా రూ.15వేలు ఇస్తానని చెప్పారు. రంజాన్ సమయంలో ప్రజలకు ఇఫ్తార్ విందు, మొహరం సందర్భంగా అన్నదానం చేస్తానని తెలిపారు. గ్రామంలో ఎవరు సొంత ఇల్లు నిర్మించుకున్నా స్లాబ్ వేసుకునే సమయంలో రూ.21వేల ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సాయాలన్నీ రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామస్తులందరికీ వర్తింపజేస్తామని స్పష్టం చేశారు.

చిట్టినాడ్ రైల్వేలైన్‌తో రైతులకు నష్టం


ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి రాసిన లేఖ

తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగెంకలాన్‌లో చిట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వేలైన్‌తో ఏర్పడిన వరద సమస్యలకు తక్షణం పరిహారం ఇవ్వాలని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సిమెంట్ ఎండీకు లేఖ రాశారు. 2015లో నిర్మించిన రైల్వేలైన్ 15కి.మీ విస్తీరణంలో ఉందని, ఇది సమీప గ్రామాలు, పంట భూముల్లో తీవ్రమైన వరద సమస్యలను సృష్టించిందన్నారు. ఈ లైన్ కట్ట వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తోందని పేర్కొన్నారు. 150 ఇళ్లు, 200ఎకరాల భూమికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. రైల్వేలైన్ అసలు డిజైన్‌లో 18 పిల్లర్లు ఉంటే కేవలం 3 స్తంభాలతో కల్వర్టులతో నిర్మించారని తెలిపారు. దీంతో వాన నీరు వెళ్లలేక ఇళ్లు, పొలాలు మునుగుతున్నాయని లేఖలో తెలిపారు. నివాసితులకు, రైతులకు వెంటనే న్యాయం చేయాలని లేఖలో డిమాండ్ చేశారు.

ఇళ్లు కోల్పోతున్న వారితో కలెక్టర్ సమావేశం



కొడంగల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారితో బుధవారం వికారాబాద్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా 8వేల గజాల్లో భూ సేకరణకు సంబంధించి ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలతో మాట్లాడారు. భూమి విలువ, ఇళ్ల విలువను బట్టి పరిహారం ఇస్తామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి నిర్వాసితులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంగీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేవంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్ఓ మంగీలాల్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఈవో రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాంబాబు, జి-సెక్షన్ సూపరింటెంట్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి


నిరసన తెలుపుతున్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు

శంషాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య అన్నారు. బీసీ రిజర్వేషన్ కల్పించాలని బుధవారం అంబేద్కర్ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన సమితి నిర్వహించిన ఆందోళనకు హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో బీసీ జనాభా 62శాతం ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు ఖరారు చేసిందన్నారు. దీన్ని అడ్డుకుంటున్న అగ్రకులాల చర్యలను తిప్పికొట్టేందుకు ఈ నెల 18న ధర్నా, రాస్తారోకోలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, జంగయ్య, ప్రభులింగం, యాదగిరి, ఆనంద్‌గౌడ్, గిరి, మంజుల, సత్తిరెడ్డి, చంద్రయ్య, రాములు, శంకరయ్య, సురేందర్ పాల్గొన్నారు.

భూసేకరణ చేపట్టొద్దు

ఆదిభట్ల/యాచారం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):యాచారం మండలం మొండిగౌరెల్లిలో సర్వే నంబర్లు 19, 68, 127లలో భూసేకరణ చేయొద్దని రైతులు బుధవారం ఎమ్మార్వో అయ్యప్పకు వినతిపత్రమందించారు. భూములను నమ్ముకొని వందలాది మంది బతుకున్నట్లు రైతులు తెలిపారు. తమ బాధలు గమనించి భూసేకరణ నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రవి రైతులు పాల్గొన్నారు.

ల్యాండవుతుండగా విమానంపై పడిన లేజర్ లైట్స్

- ఏటీసీకి సమాచారం అందించిన పైలెట్
- అంతర్గత విచారణకు ఆదేశించి ఎయిర్ లైన్స్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి వస్తున్న ఓ విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా విమానంపై లేజర్ లైట్స్ పడడంతో పైలెట్ ఏటీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. బుధవారం రాత్రి 9.36 గంటలకు తిరుపతి నుంచి వస్తున్న విమానం ఎయిర్‌పోర్టులోని రన్‌వేపై ల్యాండైంది. ఆ సమయంలో ఎయిర్‌పోర్టు బయట నుంచి లేజర్ లైట్స్ పడ్డాయి. పైలెట్ వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై ఎయిర్‌లైన్స్ అధికారులు అంతర్గత విచారణకు ఆదేశించారు. ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల లేజర్ షోలు నిర్వహించొద్దనే ఆంక్షలున్నా కొందరు లేజర్ షోలు నిర్వహిస్తున్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటన జరగగా పోలీసులు కేసు నమోదు చేశారు. తాజా ఘటనపై ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్‌ను వివరణ కోరగా ఎయిర్‌లైన్స్ నుంచి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

మహిళలకు తీపికబురు

(ఏడో పేజీ తరువాయి)

విడతలో ఒక చీర పంపిణీ చేసినా 1,93,065 చీరలు అవసరమవుతాయి. అయితే బతుకమ్మ, దసరా పండగల నాటికి వాటిలో సగం చీరలు కూడా జిల్లాకు చేరుకోలేదు. ఇప్పటిరకు జిల్లాకు 94,864 చీరలు మాత్రమే వచ్చాయి. కొడంగల్ మండల మహిళా సమాఖ్య భవనంలో 17,402 చీరలు నిల్వ ఉంచగా, పరిగి మండల సమాఖ్య భవనంలో 25,221 చీరలు నిల్వ చేశారు. తాండూరు మండల మహిళా సమాఖ్య భవనంలో 25,231 చీరలు, వికారాబాద్ మండల మహిళా సమాఖ్య భవనంలో 27,010 చీరలు నిల్వ ఉంచారు. జిల్లాకు ఇంకా 98,201 చీరలు రావాల్సి ఉంది.



బీఆర్ఎస్ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

దోమ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడురు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మైనారిటీ నాయకులు మొహ్మద్ బషీర్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో వారు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో దోమ మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, రఘు, మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నావల్ కమాండ్ ఏర్పాటుపై విచారణ

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ దామగుండం అటవీ ప్రాంతంలో భారత నావికాదళం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈఎల్ఎఫ్ రాడార్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. మరో 3 వారాలు గడువు ఇస్తున్నామని, ఈలోగా కేంద్ర ప్రభుత్వం అడిషనల్ కౌంటర్, రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణ నవంబరు 13కు వాయిదా వేసింది.

రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

దోమ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ ఎస్సీ కాలనీలో అనుమతులు లేకుండా రోడ్డుకు అడ్డంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేయాలని కాలనీవాసులు బుధవారం పంచాయతీ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి నరేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా కాలనీకి వెళ్లేందుకు కాలి బాట ఉండేదని, గ్రామానికి చెందిన కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా రోడ్డుకు అడ్డంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఇళ్ల నిర్మాణాలను నిలిపి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సిములు ఉన్నారు.

బీరయ్యయాదవ్‌ను కలిసిన నాయకులు

మోమిన్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, చంద్రాయన్‌పల్లి మాజీ సర్పంచ్ పెద్ద గొల్ల అంజయ్య తదితరులు సంగారెడ్డి జిల్లా బీసీ సీనియర్ నాయకుడు బీరయ్య యాదవ్‌ను మర్యాదపూర్వకంగా బుధవారం సంగారెడ్డిలో కలిశారు. ప్రతీ జిల్లా కేంద్రంలో పూలే మాట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల వద్ద డబ్బులు తీసుకోలేదు

యాలాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని యాలాల మండలం ముకుదాపూర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. పత్రికల్లో ప్రచురితమైన కథనంపై స్పందిస్తూ గ్రామానికి చెందిన కొంతమంది తనపై తప్పుడు ఆరోపణలు చేశారని, రోజూ గ్రామానికి వెళ్లి విధులు నిర్వహిస్తున్నానని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకోలేదని చెప్పారు. ఈ మేరకు ముకుందాపూర్‌ను ఎంపీవో సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

ప్రతి ఇంట్లో దీపాలు వెలగాలి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రతిఇంట్లో దీపాల వెలుగులు నింపాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు అన్నారు. ఈ మేరకు బుధవారం సేవా సమితి భువనగిరి శాఖ ఆధ్వర్యంలో అవుశాపూర్, అంకుశాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి దీపావళి పండుగ గురించి వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు దేవేందర్, అశోక్, లింగస్వామి, శివరామకృష్ణ, లక్ష్మీనారాయణ, సూరజ్, ధనలక్ష్మి, లత, మంజుల, రాజేశ్వరి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎఫ్‌సీనగర్‌లో డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనగర్ కాలనీవాసులు

ఘట్‌కేసర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో డ్రైనేజీ సౌకర్యం కల్పించి ఇబ్బందులు తీర్చాలని కాలనీవాసులు బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న కాలనీలో డ్రైనేజీ సౌకర్యంతోపాటు రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బొక్క ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, పద్మ, బాల్‌రాజ్, గజానంద్, అనిత, జాన్‌విజయ్, సదానంద్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను సర్వే చేయాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీసీఎల్ఏ ఆదేశాల మేరకు ప్రతి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ భూములను సర్వే చేసి, జీఐఎస్ మ్యాపింగ్ ప్రకారం ఫైల్ రూపంలో సమర్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని మండల సర్వేయర్లతో జీఐఎస్ మ్యాపింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూదాన్ భూములు, ఇతర ప్రభుత్వ భూములు కూడా జీఐఎస్ ద్వారా సర్వే పూర్తి చేసి మ్యాపులు సమర్పించాలని ఆదేశించారు. రైతులకు సంబంధించిన సర్వే కార్యకలాపాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే అధికారి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికోసారి గుండెను పరీక్షించుకోవాలి

ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ దయావాసు



తాండూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఏడాదికోసారి గుండెను పరీక్షించుకోవాలని హైదరాబాద్ మెడికవర్ ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ దయావాసు అన్నారు. గురువారం తాండూరులో మాట్లాడుతూ పదేళ్లు పైబడిన వారందరూ మూడేళ్లకోసారి పూర్తి బాడి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. 70 శాతం గుండె రక్తనాళాలు బ్లాక్ అయితేనే స్టంట్‌కు వెళ్లాలన్నారు. ఈసీజీ, టుడీకే, స్కానింగ్, ఎంజోగ్రామ్‌కు వెళ్లాలన్నారు. దమ్ము, గుండె దడ, చమటలు పట్టడం జరిగితే వెంటనే వైద్యులను సంప్రందించాలని సూచించారు. తాండూరులో వారానికి రెండు రోజులు గుండెకు సంబంధించి చికిత్స కోసం ఆదిత్య నర్సింగ్ హోం పక్కన అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు.

కొడంగల్ బంద్‌ను జయప్రదం చేయాలి

కొడంగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపునకు నిరసనగా గురువారం కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని కోకన్వీనర్ కోట్రికె లక్ష్మీనారాయణగుప్త, నాయకులు సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బంద్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్జెజీవీ.సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వాడుకోవద్దు

ధారూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వాడుకోవద్దని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం అన్నారు. మండల పరిధిలోని కేరెల్లి, తరిగోపుల, మైలారం గరుదోట్ల, అంపల్లి, దోర్నాల్, స్టేషన్ ధారూరు, పీసీఎం తండా పాఠశాలల్లో బుధవారం టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. ఉపాధ్యాయులతో ఆన్‌లైన్, పర్యవేక్షణ పనులు చేయించడం నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజయ్‌కుమార్, శివయ్య, నర్సింహులు, వై.నర్సింహులు పాల్గొన్నారు.

దాతలకు రుణపడి ఉంటాం

మేడ్చల్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో పరిశోధనలు చేయటానికి తనయుల మృతదేహాలను, అవయవాలను దానం చేసిన వారి కుటుంబాలకు రుణ పడి ఉంటామని మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.శివరామ కృష్ణ అన్నారు. అంతర్జాతీయ అనాటమి డే సందర్భంగా బుధవారం మండలంలోని ఘనాపూర్ మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాలలో తనయుల మృత దేహాలు, అవయవాలు దానం చేసిన వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ సింగ్, డాక్టర్ శైలేంద్ర, డాక్టర్ బిమల్ దేవి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

కీసర, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కీసరలో గత ఆదివారం నిర్వహించిన బొడ్రాయి వార్షికోత్సవాన్ని విజయవంతం చేసినందుకు బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఉత్సవంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సమన్వయం చేయడంలో క్రియశీల పాత్ర వహించినందుకు గాను కీసర సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యుడు నల్లా మధుసూధన్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని, గంగన్న, రాంరెడ్డిలను దమ్మాయిగూడలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

వరికి తెగుళ్ల బెడద

(ఏడో పేజీ తరువాయి)

నెల్లురు సోనా, తెలంగాణ సోనా , సూపర్ అమన్ రకాలు సాగుచేశారు. కావేరి 468, 1010, 1153, 1156 దొడ్డు రకాలు సాగుచేశారు. ప్రధానంగా మూసీ పరీవాహక ప్రాంతాల్లోని పైర్లకు బాగా తెగుళ్లు సోకాయి. నాటు దశలో మందులు చల్లిన తర్వాత వరిపైరు బాగా పెరిగింది. కానీ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు బాక్టీరియా ఎండాకు తెగులు, కంకినల్లి, దోమపోటు వంటి తెగులు సోకింది. కంకినల్లి తెగులు వల్ల గింజలన్నీ నల్లగా మారుతున్నాయి. ఎండాకు తెగులు వల్ల వరిపైరు ఆకులన్నీ ఎండి గింజలు తాలుగా మారుతున్నాయి. కోత దశలో ఎలాంటి మందులు చల్లినా ఫలితం ఉండదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముందుగానే జాగ్రత్త పడి మందులు చల్లితే తెగులు నివారణ అయ్యేదంటున్నారు. అకాల వర్షాలకు తెగులుసోకి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

వాతావరణంలో మార్పుల వల్లే..



ఇటీవల కురిసిన వర్షాలకుతోడు వాతావరణంలో వచ్చిన మార్పులకు వరిపైరుకు పలు రకాల తెగుళ్లు సోకాయి. మూసీ పరీవాహక ప్రాంతంలోని పంటకు కంకినల్లి, దోమపోటు, బాక్టీరియా ఎండాకుతెగులు సోకింది. మిగత గ్రామాల్లో పంట బాగానే ఉంది.

-లావణ్య, మండల వ్యవసాయ అధికారి

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి/యాలాల/మర్పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పరిగి మండల పరిధిలోని నస్కల్, జాఫర్‌పల్లిలో మాడల్ స్కూల్‌లో ఉమెన్ వాచ్‌మెన్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్‌ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గోపాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాచ్‌మెన్‌కు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, హెడ్‌కుక్‌కు టెన్త్, అసిస్టెంట్ కుక్‌కు ఏడో తరగతి చదివి ఉండాలని సూచించారు. అభ్యర్థులు స్థానిక చిరునామాతోపాటు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో జత చేసి సమర్పించాలని సూచించారు. అలాగే యాలాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో హెడ్‌కుక్, డే వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రమేష్ పేర్కొన్నారు. విద్యాలయంలో హెడ్‌కుక్ 1, డే వాచ్‌మెన్ 1 పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల వారు కస్తూర్బా విద్యాలయంలో ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మర్పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ, ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో తాత్కాలిక పద్ధతిలో స్కావెంజర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, మోడల్ స్కూల్‌లో హెడ్ కుక్, వాచ్‌మెన్ పోస్టులకు పదో తరగతి పాసై ఉండాలని, 25 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు అర్హులు అని ఎంఈవో అంజిలయ్య పేర్కొన్నారు.

ముమ్మరంగా గాలికుంటు నివారణ టీకాలు



కొడంగల్ రూరల్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశు వైద్యులు

కొడంగల్ రూరల్/వికారాబాద్/మోమిన్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని ఏరియా పశువైద్యశాలలో కార్యక్రమాన్ని సహాయ సంచాలకులు డాక్టర్ నోహ ప్రారంభించారు. నెల రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య జేవీవో, శేఖర్ ఎల్ఎస్ఏ, జహీర్ వీఏ, శివకుమార్ గోపాల మిత్ర పాల్గొన్నారు. వికారాబాద్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఏడీ డాక్టర్ కేవి చంద్రశేఖర్ ప్రారంభించారు. ప్రతి పశువుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి శ్వేత శ్యామలకు ఆదేశించారు. సిబ్బంది రఘు, పాపయ్య, పాల్గొన్నారు. అలాగే మోమిన్‌పేట్ మండలంలోని చంద్రాయన్‌పల్లి, మొరంగపల్లి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయా గ్రామాల్లో 334 పశువులకు టీకాలు, 18 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించినట్లు పశు వైద్యాధికారిణి గీత తెలిపారు. కార్యక్రమంలో మహమూద్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రాణి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు

కులకచర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు వర్మీ కంపోస్టు ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతగా మైత్రి ఫౌండేషన్

బొంరాస్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ జెడ్పీహెచ్ఎస్ 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులమంతా కలిసి మైత్రి ఫౌండేషన్ ఏర్పాటు చేశామని సాఫ్ట్‌వేర్ ఎన్ఆర్ఐ, ఫౌండేషన్ చైర్మన్ పాలెపల్లి ఆలమయ్యనాయుడు తెలిపారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్‌గా తిరుపతయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, కోశాధికారిగా అశోక్‌గౌడ్, అడ్మినిస్ట్రేటర్‌గా రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

రైతులకు అందుబాటులో శనగ విత్తనాలు

పూడూరు, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): మండల రైతులకు శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి తులసీరాం బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 50 శాతం సబ్సిడీపై విత్తనాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. మొత్తం 240 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషకాహారంపై అవగాహన ఉండాలి



మర్పల్లి: పట్లూర్‌లో సామూహిక సీమంతాలు

మర్పల్లి/బంట్వారం/మోమిన్‌పేట్/కులకచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ పోషకాహారంపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా అన్నారు. బుధవారం మర్పల్లి మండలంలోని పట్లూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. బంట్వారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో రాములు హాజరయ్యారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం చేశారు. అలాగే మోమిన్‌పేట్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణమాసం ఎంఈవో మల్లేశం, ఎంపీవో యాదగిరి, సూపర్‌వైజర్ పుష్పలత చిన్నారులతో అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సిములు, సీహెచ్‌వో శశికళ, దీన, పంచాయతీ కార్యదర్శి స్వప్న, అంగన్‌వాడీ టీచర్‌లు ప్రమీల, వసంత, రేణుక, భాగ్య, మమత పాల్గొన్నారు.

స్టార్ మదర్స్‌కు సన్మానం

కులకచర్ల మండలంలోని రాంనగర్ గోప్యనాయక్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో స్టార్ మదర్స్‌గా ఎంపికైన మంగమ్మ, లావణ్యను సన్మానించారు. గర్భిణులు, బాలింతలుగా ఉన్న సమయంలో వీరు వంద శాతం అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వప్న, అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ, తండా మహిళలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



ఘట్‌కేసర్ రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు/ఘట్‌కేసర్ రూరల్/పూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాండూరు కేజీబీవీలో బుధవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణరెడ్డి, రామకృష్ణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గాజుల బస్వరాజ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, విద్యావేత్త కీర్తిశర్మ, కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షుడు కేవీఎం వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘట్‌కేసర్‌లో..

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయసాధనకు కృషి చేయాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని అవుశాపూర్‌లో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, భానుయాదవ్, మహేష్, మదార్, సాయిలు, హిమామ్ పాల్గొన్నారు.

కంకల్ ప్రాథమిక పాఠశాలలో..

పూడూరు మండలం కంకల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వందశాతం హాజరైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వర్‌రావు, శ్రీను, సతీష్ నాయకుడు, శాలిని, సీఆర్పీ జంగయ్య, రాజన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం



బషీరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంసాన్‌పల్లి(బి) గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైందని ఎస్ఐ నుమాన్‌అలీ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన తలారిబాబు భార్య నర్మద(43) ఈ నెల 11న తల్లిగారి ఊరైన హైదరాబాద్‌కు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. నాలుగు రోజులైన ఇంటికి రాకపోవడంతో భర్త బంధువులను ఆరా తీశాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని జంతువు దాడి.. దూడ మృతి

కులకచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో గుర్తు తెలియని జంతువు దాడిలో గేదె దూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన చిలుముల బాలకృష్ణయ్య రోజు మాదిరిగా పొలం వద్ద మంగళవారం రాత్రి పశువులను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా దూడ మృతి చెంది కనిపించింది. దానిపై గుర్తు తెలియని జంతువు దాడి చేయగా వెనక భాగంలో గాయాలైనట్లు గుర్తించారు.



పంచాయతీ భవనానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

తండాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుద్యాల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తండాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని సత్తర్ కుంట తండాలో రూ.30 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ సురేందర్‌రెడ్డి, నాయకులు నర్సిములుయాదవ్, రవినాయక్, నర్సిములు, కృష్ణ, శివరాంనాయక్, రవిరాథోడ్, నరసింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, దేవిదాస్ పాల్గొన్నారు.

దాడి చేసిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

తాండూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలెపి జిన్‌గుర్తి శివారులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ నీర్జనపై చేయి చేసుకున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం గిరిజన బాలికల పాఠశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయపూరి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తుందని ఆరోపించారు. ఆమె ఒత్తిడి తట్టుకోలేక రెండు నెలల క్రితం జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. ఇంత జరిగిన రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జున్ రావు ఆమెపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆమెపై చర్యలు తీసుకోనకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం ప్రతినిధులు చింటు పవర్, రమేష్ నాయక్, రాజు నాయక్ ఉన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బాధితులు, నాయకులు

బషీరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడి కుటుంబంపై దాడి జరిగినా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేసిన బషీరాబాద్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య బుధవారం ఎస్పీ నారాయణరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలోని దామర్‌చెడ్ గ్రామానికి చెందిన చెరుకు రాజుగౌడ్, అతడి భార్య అర్చనపై ఓ వ్యక్తి దాడి చేసిన సమయంలో డయల్ 100కు కాల్ చేస్తే స్థానిక పోలీసులు రాలేదన్నారు. అదే రోజు రాత్రి స్వయంగా వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. ఎస్పీని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ, కృష్ణ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతోనే అజ్ఞాతంలోకి..

దౌల్తాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోడమర్రితండాకు చెందిన రమేశ్ ఆర్థిక ఇబ్బందులతోనే అజ్ఞాతంలోకి వెళ్లాడని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బోడివెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నెల రోజుల క్రితం మద్దూర్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఆర్థిక లావాదేవీల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. 20 రోజుల క్రితం 17 పేజీల సూసైడ్ నోట్ రాసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడన్నారు. అధికార పార్టీ నాయకుల అండతో కొంత మంది రమేశ్‌ను కిడ్నాప్ చేశారని బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. బుధవారం రమేశ్ నాయక్ సొంత గ్రామం బోడమర్రిగడ్డ తండాకు చేరుకోవడంతో కాంగ్రెస్ నాయకులు అక్కడకు వెళ్లి ఆయనను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. నాయకులు మోహన్‌నాయక్, జాకీర్, గోపాల్ ఉన్నారు.

విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో బోధించాలి

మోమిన్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు బోధించాలని ఎంఈవో మల్లేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో డిజిటల్ లిటరసీలో భాగంగా మర్పల్లి, మోమిన్‌పేట్, బంటారం, కోట్‌పల్లి మండలాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో బోధించడంతో సులభంగా అర్థం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు అంజిలయ్య, చంద్రయ్య, రీసోర్స్ పర్సన్‌లు మదనాచారి, శివకుమార్, ఖాజాపాష, అనురాధ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

పరిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పరిగి ఎంఈవో గోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తొండపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సరస్వతి పాల్గొన్నారు.

గురుకుల్‌కు ఉపాధ్యాయులను నియమించాలి

ఘట్‌కేసర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ గురుకుల్ పాఠశాల నిర్వాహణకు ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడి డిమాండ్ చేశారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని గురుకుల్ పాఠశాలలో ఆయా పార్టీల నాయకులు సమావేశమై పాఠశాల నిర్వాహణపై చర్చించారు. ప్రస్తుతం వివిధ తరగతుల్లో 13మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో ఉన్న ఒక్క ఉపాధ్యాయురాలు అన్ని సబ్జెక్టులు బోధించడానికి అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి తక్షణమే గురుకుల్‌కు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈనెల 19న మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. శ్రీనివాస్, రాంరెడ్డి, సంజీవ, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



గురుకుల్ పాఠశాల నిర్వహణపై చర్చిస్తున్న నాయకులు